

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం | 18 | జూన్ | 2026 | పేజీలు: 08


# చదువుతోనే విద్యార్థుల భవిత

**వికారాబాద్‌లో శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం**

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**




**వికారాబాద్, అక్షిత బ్యూరో :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధి ఆర్ బి సోనీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌ను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిగి శాసనసభ్యులు టి. రాంమోహన్ రెడ్డి వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అన్న పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ..మిగతా 2లో



# పకడ్బందీగా డిజిటల్ సభ్యత్వం

## కేసీఆర్ హయాంలో సంక్షేమం

**కాంగ్రెస్ అవినీతిమయం**

**అపరిచితుడు ఓటిపి ఎమ్మెల్యే**

**మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**

**డిజిటల్ సభ్యత్వం అగ్రస్థానంలో ఉండాలి**

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**





**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** కేసిఆర్ అంటే సంక్షేమ పథకాల ప్రభుత్వమని కాంగ్రెస్ కుంభాకోణాల ప్రభుత్వమని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్, నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లమోతు భాస్కర్ రావు అధ్యక్షతన స్థానిక టీఎన్ఆర్ గార్డెన్స్‌లో ..మిగతా 2లో

**సోలార్ ప్లాంట్ పెట్టండి**

# లాభాలు ఆర్జించండి

**నాబార్డు ద్వారా రుణం పొందండి**

**సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**



**కరీంనగర్, అక్షిత బ్యూరో :** సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. బుధవారం చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ..మిగతా 2లో

# ఓటర్ల జాబితా ప్రక్షాళన

**ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు నాయకులు సహకరించాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :** రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ..మిగతా 2లో





# బడులను పటిష్టం చేద్దాం

**విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి**

**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, అక్షిత బ్యూరో :** ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని, అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి ..మిగతా 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
గురువారం |18| జూన్ | 2026

## బడులను పటిష్టం చేద్దాం



**మొదటి పేజీ తరువాయి...**

గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో, డిడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్వాడిలలో , ప్రీ స్కూల్స్ లో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు.

అంగన్వాడీలలో, ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడి టీచర్లు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి , ఎంఈఓ తారా సింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్ పెట్టండి లాభాలు ఆర్జించండి



**మొదటి పేజీ తరువాయి...**

ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికి పైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ద్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదువుతోనే విద్యార్థుల భవిత




**మొదటి పేజీ తరువాయి...**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతోనే భావితరాల భవిష్యత్తు బంగారు మయమవుతుందని, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటైన ఈ పాఠశాల వికారాబాద్ విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు.

# పకడ్బందీగా డిజిటల్ సభ్యత్వం





**మొదటి పేజీ తరువాయి...**

జరిగిన ఎస్ఐఆర్ పై బూత్ లెవెల్ ఏజెంట్ల(బిఎల్ఎల) కు శిక్షణ, బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత నమోదుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ శాఖ కూడా సరిగా పనిచేయడం లేదని, పోలీస్ శాఖ మాత్రం పనిచేస్తుందని, ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వాట్సాప్ గ్రూపులలో ఎవరైనా మెసేజ్ లు పెడితే వారిపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పుడు కేసులు నమోదు చేసి బిఆర్ఎస్ కార్యకర్తలకు ఇబ్బంది పెట్టిన పోలీసులపై కేసులు పెట్టి జైలు పంపిస్తామన్నారు. వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇప్పించేందుకు ఉద్యమిస్తామని ఆయన అన్నారు. ఓటిపి, అపరిచితుడు ఎమ్మెల్యే అని పరోక్షంగా మిర్యాలగూడ ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. ఓటర్ల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) లో బిఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బిఎల్ఏలు ఎస్ఐఆర్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐపీఎస్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రమాదంలో ఉందని, కుంభకోణాల ప్రభుత్వమని ఆరోపించారు. బిఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంటు నిరంతరం బిఎల్ఓల వెంట ఉండాలని, ఒక నెల పాటు నిజాయితీ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. బూత్ పరిధిలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఎ లపై ఉందన్నారు. ఏజెంట్లకు ఎస్ఐఆర్ పై పూర్తి అవగాహన కల్పించారు. మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంటు పూర్తి అవగాహనతో పనిచేయాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ను బలోపేతం చేసేందుకు డిజిటల్ సభ్యతాలు పకడ్బందీగా చేయాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు గడప గడపకు తిరిగి ఓట్లు తొలగించకుండా జాగ్రత్తగావ్యవహరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు మాట్లాడుతూ నియోజకవర్గ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండి, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. వీర్లపాలెం యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కెసిఆర్ నాయకత్వంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సహకారంతోనే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగదీష్ రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 స్థానాలు బిఆర్ ఎస్ కైవసం చేసుకుని, గులాబీ జెండా ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ యువనేత నల్లమోతు సిద్ధార్థ మాట్లాడుతూ బిఆర్ఎస్ నియోజకవర్గంలో బలంగా ఉందన్నారు. నెల రోజులపాటు బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో

మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు అలుగుబెల్లి అమరేందర్రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాగార్జునచారి, బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, మాజీద్, మగ్దుమ్, దినేష్, ఎన్.కర్ణాకర్ రెడ్డి, ఎండి యూసుఫ్, నారాయణరెడ్డి, వీరకోటిరెడ్డి, మోహిస్టిన్అలీ, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, షాహనాజ్ బేగం, జొన్నలగడ్డ రంగారెడ్డి, బాబాయ్, షోయబ్, వింజం శ్రీధర్, కోటేశ్వరరావు, గయాస్, మస్తాన్, అలీమ్, పహిముద్దీన్, మౌజమ్ అలీ, హబీబ్, రాంబాబు నాయక్, హాతీరాంనాయక్, చిట్టిబాబునాయక్, డి.కళావతి, స్రవంతి శ్రీనివాసరావు, బాలు నాయక్, గుడిసె దుర్గ ప్రసాద్, పాల్గొన్నారు. బిఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఆధ్వర్యంలో కదంతొక్కిన గులాబీ దళం. రాబోయే రోజుల్లో రాజకీయంగా సరికొత్త వ్యూహాలతో దూసుకుపోయేందుకు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు భారత్ రాష్ట్ర సమితి శ్రేణులు సన్నద్ధమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ నలుమూలల నుండి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సమావేశంలో ప్రధానంగా పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ (సభ్యత్వ నమోదు) కార్యక్రమం క్షేత్రస్థాయి పోరాటాలకు సన్నద్ధం

ఈ సమావేశం కేవలం అంతర్గత సమీక్షకే పరిమితం కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కేడర్‌కు దిశా నిర్దేశం చేసింది. ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని, కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి...**




కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు.జూన్ 25 - జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని,2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 - 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు.ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి,విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.వలస వెళ్లిన వారు, మరణించిన వారు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు.ప్రజా ప్రాతినిధ్య చట్టం,1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశ పూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష,జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పని సరిగా ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు.ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్,జిల్లా రెవిన్యూ అధికారి డి.ప్రేమ్ రాజ్,చకలం రాజేశ్వర్ రావు,అంజాద్ అలీ(ఐ ఎన్ సి ) కరుణాకర్ రెడ్డి,సవరాల సత్యనారాయణ(బిఆర్ఎస్), అభిద్(బీజేపీ),కోట గోపి సిపిఐ(ఎం),స్టాలిన్ (బిఎస్పి) తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే
# బలమైన పునాది



### విద్యార్థుల నైపుణ్యాల పెంపుతో పాటు హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 17 :** ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయని, నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రభుత్వ బడులే ఉత్తమ వేదికలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య పెంపు కోసం ఉపాధ్యాయులు మరింత చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. బడికి హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలపై అసంతృప్తి వ్యక్తం



చేస్తూ వెంటనే మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్, పాఠ్యాంశాల అధ్యయనంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం కూడా అవసరమని తెలిపారు. విద్యార్థులకు లెక్కలు చేయించి, వివిధ ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. కేవలం పరీక్షల ఫలితాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, వైద్య సేవల నిర్వహణ, రోగుల రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రస్తుత కాలానుగుణ వ్యాధుల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

అనంతరం అందకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విభాగాన్ని ప్రారంభించిన కలెక్టర్, చిన్నారులతో ముచ్చటించి వారి అభ్యాసంపై ఆసక్తి కనబరిచారు. విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని విద్య ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, మండల విద్యాధికారి ముత్యం, సర్పంచ్ గజేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా,
# క్రమబద్ధంగా నిర్వహించాలి

### సీసీ కెమెరాల పరిధిలో కార్యకలాపాలు నిర్వహించాలి

### రైతులకు అన్ని వసతులు అందుబాటులో ఉండాలి

### ప్రజా సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలి

### రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జనగామ అక్షిత బ్యూరో :** ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించే కేంద్రాలుగా ఉన్నందున, వాటి నిర్వహణలో నాణ్యత, పారదర్శకత, క్రమబద్ధత ఉండాలని లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి పేర్కొన్నారు.

బుధవారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలిస్తూ, ప్రతి విభాగం పనితీరును, కార్యాలయ ఆవరణ, ఫర్నిచర్, ఫైళ్ల అమరిక,





తదితర అంశాల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు.

కార్యాలయాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

రికార్డులు, ఫైళ్లను విభాగాల వారీగా క్రమబద్ధీకరించాలని తెలిపారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు సులభంగా సేవలు పొందే విధంగా ఏర్పాట్లు ఉండాలని అన్నారు.

కార్యాలయ భద్రత, పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు సీసీ కెమెరాల పరిధిలో అన్ని ముఖ్య కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రికార్డు రూమ్ నిర్వహణ అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని పేర్కొన్నారు. కీలక పత్రాలు, దస్త్రాలు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాటిని సులభంగా గుర్తించే విధంగా వర్గీకరించి భద్రపరచాలని సూచించారు. రికార్డు గదుల్లో తేమ, దుమ్ము, అగ్ని ప్రమాదాలు వంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

ప్రజలకు అవసరమైన సమాచారం, దరఖాస్తు సేవలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల వివరాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తాగునీరు, కూర్చునే సౌకర్యం, సమాచార బోర్డులు, తదితర సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దాలని లికలెక్టర్‌లి స్పష్టం చేశారు.

## విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్, అక్షిత బ్యూరో:** నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమై ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్స్‌స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించగా, ఇటీవల నిర్వహించిన జె.ఈ.ఈ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్‌తో ముంబాయి ఐఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని. దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ముఖ్యంగా నిరంతరం విధుల్లో వుండే పోలీసుల పిల్లలు గత కొద్ది సంవత్సరాలు చదువుల్లో రాణించడం, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సిపి తెలియజేసారు.

## అభిమాని నిరంజన్ ను పరామర్శించిన పవన్ కళ్యాణ్



**వరంగల్, అక్షిత బ్యూరో:** జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్ ్నఅభిమాని కోరికను గౌరవించి ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా.. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం.నిరంజన్ కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం చేసిన నిర్మాత బండ్ల గణేష్.. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభిమానులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి




**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** ఈ రోజు బాగులవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతి శిశు మందిర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్కూల్‌ను ప్రారంభించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,ఎం పి గోడం నగేష్, కౌన్సిలర్లు,డాక్టర్స్ మరియు స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయం



**అన్ని మండలాల్లో ఇదే రీతిన ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశం..**

**జిల్లా కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఖ. హరిత అన్నారు బుధవారం జిల్లాలోని కేరెమెరి మండలం గోయగం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలలో నిర్వహిస్తున్న 'సామూహిక అక్షరాభ్యాసం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలోని అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరియు పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోయెగాం పాఠశాలను ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మరియు ఉపాధ్యాయులు కలిసికట్టుగా ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఇదే రీతిలో అభివృద్ధి పథంలో నడిపించాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు మరియు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, మండల విద్యాశాఖ అధికారిఉపేందర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎవరికులమెంతో వారికంత వాట సాధించే వరకు పోరాటం: రాదండి దేవేందర్



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఇప్పటికీ అధికార అవకాశాలకు, నిర్ణయాధికార స్థాయిలకు దూరంగా నెట్టివేయబడుతున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు, రాజకీయ భాగస్వామ్యం కోసం బహుజన వర్గాలన్నీ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడేలా వ్యవస్థ పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నో దశాబ్దాలుగా అగ్రవర్ణ ఆధిపత్య రాజకీయాల కారణంగా బహుజన వర్గాలకు తగిన స్థానం దక్కడం లేదని విమర్శించారు. కేవలం ఓట్ల కోసం మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఉపయోగించుకుంటూ, అధికారంలో మాత్రం వారికి సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని బహుజన వర్గాల ప్రజలు కుల, పార్టీ, ప్రాంత భేదాలను పక్కనపెట్టి ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ యువత నాయకత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, ఉద్యోగాలు, భూమి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో బహుజన వర్గాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు అగ్రవర్ణాల ఆధిపత్య రాజకీయాలకు ఊరేగింపుగా మారకుండా, బహుజన సమాజ ప్రయోజనాల కోసం నిలబడాలని ఆయన సూచించారు. "బానిస మనస్తత్వాన్ని విడిచిపెట్టి, బహుజన ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి" అని అన్నారు.తెలంగాణలో నిజమైన సామాజిక మార్పు రావాలంటే బహుజన వర్గాల ఐక్యతే మార్గమని, రాజ్యాధికారం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా చర్చలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల ,(అక్షిత న్యూస్):** జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 36 లక్షల రూపాయల మూడ నిధులతో నిర్మించనున్న నూతన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. విద్యార్థుల విజయాలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం కూడా కీలకమని పేర్కొన్నారు.

## అంగరంగ వైభవంగా భద్రఖాళీ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవము

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు హాజరు**





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రఖాళీ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరితో పాటు యువజన కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు భద్రఖాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేకంగా అలంకరించిన ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్



**రాజోలి అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద తాండ్రపాడు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ చింతల క్యాంపు పాఠశాల నందు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ సుబ్బారెడ్డి హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సుబ్బారెడ్డి, గ్రామస్తులు కలిసి వారి చేతుల మీదుగా పిల్లలకు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, మరియు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు చాలా బాగున్నాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని మంచిగా విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలియజేశారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయుడు టి మోహన్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్నం పౌష్టికాహారం అందించడం జరుగుతుందనీ ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల లోనే చదివించాలని మోహన్ రెడ్డి సూచించారు. అలాగే పాఠశాలకు కావలసిన ప్రహరీ గోడ నిర్మాణం మరియు మరమ్మత్తుల గురించి సర్పంచ్ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకురాగా పాఠశాల లోని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి విద్యార్థినులు వారి తల్లిదండ్రులు తదితరులుపాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# కోదాడ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యం

### ఎమ్మెల్యే పద్మావతి ఉత్తం

### రాజకీయాల్లో మహిళా నాయకత్వానికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

### ఎర్నేని ఆధ్వర్యంలో ఘనంగ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు



**కోదాడ అక్షిత ప్రతినిధి:** ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఉత్తమ్ రెడ్డి జన్మదిన వేడుకలను మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ రెడ్డి రాజకీయ, సామాజిక సేవలను కొనియాడిన ఎర్నేని మాట్లాడుతూ మహిళా నాయకత్వానికి ఆమె నిలువెత్తు నిదర్శనమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చొరవ, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఆమెను ప్రత్యేక నాయకురాలిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.1938 కోట్ల నిధులను తీసుకువచ్చి రహదారులు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పట్టణ మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల



అమలులో వేగం పెంచి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రగతి ప్రదాతగా పద్మావతి ఉత్తమ్ రెడ్డి నిలిచారని తెలిపారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకునేందుకు నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రతి వర్గానికి అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆమె ప్రజా ప్రతినిధిగా విశేష గుర్తింపు పొందారని అన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత, పారదర్శకతకు ప్రతీకగా నిలుస్తూ ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలిగా పద్మావతి ఉత్తమ్ రెడ్డి ఎదిగారని కొనియాడారు. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాల్లో సమాన అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, సామాన్య ప్రజలకు అండగా నిలుస్తూ, నిస్వార్థ సేవతో రాజకీయాలకు ఆదర్శంగా నిలిచిన ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కోదాడ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేపడుతున్న కృషి మరింత విజయవంతం కావాలని, భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు , సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కౌన్సిలర్ లు కట్టబోయిన జ్యోతి శ్రీనివాస్, పాశం శ్రీనివాస్, నాగేంద్రమ్మ, కాంగ్రెస్ నాయకులు ఉప్పుగండ్ల శ్రీనివాస రావు, రావెళ్ల కృష్ణారావు మైలారి శెట్టి భాస్కర్ మట్టపల్లి సాలయ్య, కాజా, నెమ్మది దేవమని ప్రకాష్ బాబు, వంటిపులి శ్రీనివాస్, వేమూరి విద్యాసాగర్, గంధం పాండు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు నిర్మూలనలో నిర్లక్ష్యానికి తావులేదు

### డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్



**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత బ్యూరో:** జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డా. తుకారాం రాథోడ్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా కుష్ఠు నిర్మూలన కార్యక్రమాలపై జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారులు (లెప్రసీ) మరియు ఆరోగ్య విద్యా బోధకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అనుమానితులను వేగంగా గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) ప్రారంభించి, చికిత్సను పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో క్రియాశీల కేసుల అన్వేషణ, సన్నిహితుల సర్వేలు, తదుపరి పర్యవేక్షణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని ఆరోగ్య విద్యా బోధకులకు సూచించారు.

అదేవిధంగా సమాచార, విద్యా, కమ్యూనికేషన్ (ఐఈసీ) కార్యక్రమాలు మరియు ప్రవర్తనా మార్పు కమ్యూనికేషన్ (బీసీసీ) కార్యక్రమాలను బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించాలని ఆదేశించారు.నిర్దేశిత లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో చేతబడి, బాణామతి, క్షుద్రపూజలు వంటి మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్య విద్యా బోధకులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యక్రమ అధికారి డా. ప్రతాప్, ఫిజియోథెరపిస్టు భద్రు, మోహన్, శ్రీనివాస్, ఆరోగ్య విద్యా బోధకులు జయలక్ష్మి, రమాదేవి, బేబీ, వినయ్ కుమార్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

# జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మీడియా సమావేశం

**జగిత్యాల అక్షితబ్యూరో:** ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ఎంపీ అరవింద్ మరియు వారి అనుచరులు చేస్తున్న వాఖ్యల పై స్పందిస్తూ జగిత్యాల మేధావులు, ప్రజల కు తెలియజేస్తున్నా.. కేంద్రీయ విద్యాలయం కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయింపు కోసం కలెక్టర్ సర్వే చేసి డిప్యూటీ కమిషనర్, కేంద్రీయ విద్యాలయం సంఘటన్ కు పది రోజుల క్రితం సంబంధిత పత్రాలు పంపించారు. అయినా కేంద్రీయ విద్యాలయం పై ఎంపీ అరవింద్ తీరు మారడం లేదు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటును కావాలని రాజకీయం చేస్తున్నారు. కరీంనగర్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో 2011 లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశారని, 2017 లో ఏడు ఎకరాల స్థలంలో ఎల్.యం.డి కి మార్చారని గుర్తు చేశారు.

కేంద్రం దేశంలోని ప్రతి జిల్లాకు నవోదయ కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయటం జరుగుతుంది, అని జగిత్యాల జిల్లా ఏర్పడ్డా తొమ్మిదేండ్ల కు మంజూరు ఇచ్చారని అన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పాత ఎస్పీ కార్యాలయాన్ని కేటాయించడం జరిగింది అని, కొన్ని చిన్నపాటి మరమ్మత్తులు కూడా చేపట్టడం జరిగింది అని, చల్ గల్ లో 5 ఎకరాల స్థలం సర్వే వివరాలు కలెక్టర్ కేంద్రీయ విద్యాలయం సంఘటన్ కు పంపారని అన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా కృషి




చేస్తున్నారు అని అన్నారు. ఎంపీ వైఖరి మారాలని, జగిత్యాల మేధావులు ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. గతంలో వాలంతరి క్షేత్రం సేవలు నామ మాత్రంగా ఉండడం వల్ల, కోరగానే గత ప్రభుత్వంలో పండ్ల వ్యాపారులకు స్థలం కేటాయించడం జరిగింది. గతంలో మంత్రిగా చేసిన జీవన్ రెడ్డి హయాంలో సైతం వ్యాపారులు షెడ్లు వేసుకొని వ్యాపారం చేశారు. వారికి కూడా డబ్బులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కావాలని వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హననం చేయటం తగదని ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని అన్నారు. డబ్బుల కోసం రాజకీయాలు చేసే వ్యక్తిత్వం తనది కాదని అన్నారు. కేంద్రం చల్ గల్ వాలంతరి క్షేత్రం శాస్త్రవేత్తలకు, రైతులకు జాతీయ సహజ వ్యవసాయ శిక్షణ కోసం 2025 ఏప్రిల్ 26 న కేంద్రం రాష్ట ప్రభుత్వానికి వాలంతరి క్షేత్రం ఉపయోగపడాలని లేఖ పంపింది, అని దానిలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కు రెండు ఎకరాలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు పది ఎకరాలు కేటాయించారు అని అన్నారు.

నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాలంతరి క్షేత్రం ను సహజ వ్యవసాయ ఆర్గానిక్ ఫామ్ కోసం ఉపయోగించాలని ఆలోచన చేస్తున్నాయి అని అన్నారు. 'కేంద్రీయ విద్యాలయం, చల్ గల్' అని జీవో తేవడంతో ఇబ్బందిగా మారిందని అన్నారు. అయినా ప్రజల కోరిక మేరకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు 5 ఎకరాల స్థలం కోసం పూర్తి సర్వే చేసి సిద్ధం చేసి, కేంద్రీయ విద్యాలయం సంఘటన్ కు పంపారని అన్నారు ఇప్పటికైనా కేంద్రీయ విద్యాలయం పై రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, జ్యోతి లక్ష్మణ్, పిసిసి సెక్రెటరీ బండ శంకర్, నాయకులు గట్టు సతీష్, మన్సూర్, చాంద్ పాషా, కొత్త మోహన్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, బాల ముకుందం, దుమాల రాజకుమార్, అచ్యుత్ రావు, నారపాక రమేష్, ప్రశాంత్ రావు, బీరం రాజేష్, సాయి, ముఖేష్ ఖన్నా ,కూతురు రాజేష్, క్యాదసు నవీన్, రామకృష్ణ రెడ్డి, నలువల సురేష్, మల్లేశం గౌడ్, శ్రీనివాస్, ఆరుముల్ల పవన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన



**వలిగొండ /అక్షిత న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామం మధిర గోలిగూడెంలో సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేదమూర్తి చంద్రశేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి హోమం, శంకు చక్రధారణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించగా, గ్రామ ప్రముఖులు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష, మాజీ సర్పంచులు కొమ్మిడి లక్ష్మారెడ్డి జక్క వెంకట్ రెడ్డి, వార్డు మెంబర్లు పిన్నింటి ఉమారాణి, కంచి శ్రీధర్ ఆలయ కమిటీ అధ్యక్షులు మన్నెం శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షుడు కొంతం రాంరెడ్డి, సెక్రటరీ బలుగురి మహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కంచి యాదయ్య, పడమటి బు,చ్చిరెడ్డి, చిలుకూరు మల్లారెడ్డి కాసర్ల నరసింహారెడ్డి ఫైళ్ళ నర్సిరెడ్డి కొంతం తిరుమల్ రెడ్డి, కొలను వెంకటరెడ్డి, మన్నెం జోగిరెడ్డి పులిగిల్ల గ్రామ వార్డు మెంబర్లు గోలిగుడెం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 19న పీఐబీ 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్

**మహబూబ్ నగర్ ,(అక్షిత న్యూస్):** కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల పాలనా కాలంలో అమలు చేసిన ముఖ్యమైన పథకాల గురించీ, అలాగే పాత్రికేయ వృత్తిలో కృత్రిమ మేధ వినియోగం వంటి అంశాలపై నిపుణుల ఆధ్వర్యంలో పాత్రికేయులకు అవగాహన కల్పించాలన్న ముఖ్యోద్దేశంతో- భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన పత్రికా సమాచార కేంద్రం (పీఐబీ)- హైదరాబాద్- ఆధ్వర్యంలో "వార్తాలాప్ - మీడియా వర్క్‌షాప్" కార్యక్రమాన్నీ, కృత్రిమ మేధపై ఒక ప్రత్యేక సదస్సునీ నిర్వహిస్తున్నారు. వార్తాలాప్ - మీడియా వర్క్‌షాప్ జూన్ 19, 2026 శుక్రవారం ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్‌లోని హిమాలయ బ్యాంక్వెట్ హాల్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకి చెందిన పాత్రికేయులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పీఐబీ- హైదరాబాద్ ఏడీజీ శృతీ పాటిల్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: వి. గాయత్రి మీడియా, కమ్యూనికేషన్ అధికారి, పీఐబీ, హైదరాబాద్ సెల్: 90525 65123.

## విజయవంతంగా నైపుణ్య శిక్షణ పరీక్షలు

### మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహార్



**మహబూబ్ నగర్,(అక్షిత న్యూస్):** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల భాగంగా ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషన్ మరియు కంప్యూటర్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ పొందిన మహిళలకు సంబంధించి ఫైనల్ పరీక్షలను ప్రతిష్టాత్మక సంస్థ అయిన సెట్విన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. గత మూడు నెలలుగా నిష్ణాతులైన అధ్యాపకుల చేత శిక్షణ పొందిన మహిళలు ఎంతో ఆసక్తి మరియు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్ ల వారికి శిక్షణ అందించగా , ఇప్పటికే చాలామంది మహిళలు సొంతంగా ఉపాధి అవకాశాలు పొందడమే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని , బ్యాంకుల ద్వారా రుణాలు కూడా కొందరు తీసుకొని అద్భుతంగా వారివారి కోర్సులలో రాణిస్తున్నారని తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ సెంటర్ ద్వారా వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణను మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ సమగ్రంగా పర్యవేక్షించారు. అలాగే సెట్విన్ సంస్థ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, మహబూబ్ నగర్ ఫస్ట్ ఇంచార్జ్ నిజలింగప్ప మరియు ఇతర నిర్వాహకులు పాల్గొని పరీక్షల సజావుగా సాగేందుకు తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప మాట్లాడుతూ, నిరుద్యోగ మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా వారిని ఆత్మనిర్భరులుగా మార్చడం, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను విస్తరించి, ఎక్కువమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# జేపీ దర్గాలో పిసిసి అధ్యక్షుడు ప్రత్యేక పూజలు



### పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** జహంగీర్ పీర్ దర్గాలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజక వర్గంలోని ప్రముఖ జేపీ దర్గా ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పప్పరస్పోర్ట్ ఆవరణలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్, కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జే. సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, నందిగామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్, వెంకమ్మగూడ సర్పంచ్ గొల్లపల్లి అశోక్, చేగుర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం, బుగ్గోనీగూడ సర్పంచ్ బుగ్గ సాలయ్య, నందిగామ మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవులమంద శివశంకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.మహేష్ గౌడ్‌కు పూలమాలలు వేసి ఆత్మీయ స్వాగతం పలికారు. జేపీ దర్గా మతసామరస్యానికి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి, సుభిక్షత కోసం ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పిసిసి అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేశారు..

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు

### ప్రతి భారతీయుడు ఓటు నమోదు చేసుకోవాలి

### బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఉమ్మడి కొత్తూరు మండలం, కొత్తూరు మున్సిపాలిటీ, నందిగామ మండలాలకు చెందిన బీఎల్‌ఏ-2లు, ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందె బాబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అశోక్ గౌడ్, ఐటీ సెల్ నాయకుడు వెంకటరమణ, నరసింహ గౌడ్, ఎస్ఐఆర్ కో-కన్వీనర్ వెంకటేష్ యాదవ్, మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, రణధీర్ గౌడ్, అరవింద్ చారి, రమేష్, నాగరాజు, మాణిక్యం, సుధాకర్ అప్పా, మోహన్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని, ఇది కొత్తగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం కాదని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 11 సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం అనేకసార్లు ఎస్ఐఆర్ నిర్వహించిందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి భారతీయ పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారిన వారి వివరాల సవరణ, ఒక వ్యక్తి పేరు ఒకే చోట మాత్రమే నమోదు అయ్యేలా చూడడం వంటి అంశాల కోసం ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వివరించారు. ఎన్నికల సంఘం అధికారులు,



బీఎల్‌ఏలు ఇంటింటికీ వచ్చినప్పుడు ఓటర్లు అవసరమైన ఫారాలను పూరించి సమర్పించాలని కోరారు. కులం, మతం, ప్రాంతం అనే భేదం లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. అక్రమంగా ఓటరు జాబితాల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నాలు జరిగితే వాటికి సంబంధించిన ఆధారాలను ఎన్నికల సంఘం పరిశీలించడం సహజ ప్రక్రియేనని తెలిపారు.

ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించబడిందని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల నుంచి, ముఖ్యంగా బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వచ్చిన వ్యక్తులు ఓటరు జాబితాల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల పరిశీలనను మరింత పకడ్బందీగా చేపడుతోందని చెప్పారు. అర్హులైన భారతీయ పౌరుల ఓటు హక్కును కాపాడుతూ, అనర్హులు జాబితాలో చేరకుండా చూడటమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటమి భయంతోనే ఎస్ఐఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. గతంలో ఈవీఎంలపై తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదని, ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీ జరుగుతోందంటూ మరోసారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయని, అనేక చోట్ల బీజేపీ అభ్యర్థులు కూడా ఓడిపోయారని, కాబట్టి ఎన్నికల ఫలితాలకు ఎస్ఐఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ తదితరులు ఎస్ఐఆర్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజల మనసులు గెలుచుకునే రాజకీయాలు చేయాలని, బీజేపీపై నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.

లిఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందె బాబయ్యలి మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఓటరు జాబితాల్లో ఎలాంటి దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు నమోదు కాకుండా ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి నిజమైన ఓటరు పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఐటీ సెల్ నాయకుడు వెంకటరమణ ఎస్ఐఆర్ ప్రక్రియ, ఫారాల సమర్పణ విధానం, బీఎల్‌ఏల బాధ్యతలు, ఓటరు నమోదు, సవరణలు మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు కోసం భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో శివలింగం కుమార్,కుమార్ నాయక్, హేమంత్ నరసింహ,మోహన్ ఉమ్మడి కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# పోక్సో-హత్య కేసులో సంచలన తీర్పు...

**నిందితుడుకి పోక్సో కేసులో 20 సం. జైలు శిక్ష,హత్య కేసులో జీవిత ఖైదు..**

**పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు వరుస శిక్షలు**

**నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను , పిపి,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** చందుర్తి,వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో నమోదైన రెండు కేసుల్లో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పోక్సో కేసుతో పాటు,అదే బాలిక హత్య కేసులో నిందితుడికి పోక్సో కేసులో 20 సం.హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

**కేసుల వివరాలు..**

కోడిమ్యాల్ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బండపల్లి నవీన్ అనే వ్యక్తి చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను లైంగికా వేధింపులకి గురి చేసిన విషయంలో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి వేములవాడ డిఎస్పీ వెంకటరమణ దర్యాప్తు అనంతరం నిందితుడినీ రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేసారు.

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన అదే మైనర్ బాలిక హత్య కేసులో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి వేములవాడటౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామనికి చెందిన బండపల్లి నవీన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడి రిమాండ్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది.

**కోర్టు తీర్పు..**

కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో చందుర్తి,వేములవాడ కోర్టు కానిస్టేబుల్స్ లతీఫ్, మహేందర్ , కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించగా,శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలీశీచిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన బండపల్లి నవీన్ కి పోక్సో కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్ష,రూ. 7000 జరిమాన , హత్య కేసులో జీవిత ఖైదు రూ.5000/- విధించారు. సమాజంలో నేరం చెసిన వారు ఎవరు కుడా శిక్షల నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని,పోలీసులు,ప్రాసిక్యూషన్ వారు వ్యూహాత్మకంగా న్యాయ నిరూపణ,న్యాయ విచారణ జరిపి శిక్షలు పడేల చెస్తారని సూచించారు.

ఈకేసులలో పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన పోక్సో కేసులో అప్పటి విచారణ అధికారి డిఎస్పీ వెంకటరమణ,ప్రస్తుత డిఎస్పీ శ్రీనివాసులు,ఎస్.ఐ రమేష్,హత్య కేసులో అప్పటి విచారణ అధికారి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ప్రస్తుత ఇన్స్పెక్టర్ వీరప్రసాద్,గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు,కోర్టు కానిస్టేబుల్స్ మహేందర్, లతీఫ్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందించారు.

మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు.

# పాపి కొండల్లో బాహుబలి..?

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన..**





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** ఇటీవల జరిగిన ప్రజావాణిలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఎస్పీకే సాగర్ ఇచ్చిన ఫిర్యాదు ఇప్పుడు జిల్లా లో హాట్ టాపిక్ గా మారింది..రెండో శనివారం రోజున ఒక ప్రైవేట్ స్కూల్ వ్యాన్ కు సుమారు 80 లీటర్ల డీజిల్ ఎందుకు కొట్టించారు..అని అధికారులను ప్రశ్నించాడు..మున్సిపల్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ప్రధానంగా ఆరోపిస్తున్నాడు..ఇప్పుడు ఆ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ చుట్టూ అందులో కొంత మంది వెళ్లిన టూర్ గురించి జిల్లాలో ఆసక్తికర చర్చ నడుస్తోంది..వ్యాన్ లో కొట్టించిన డీజిల్ బిల్ పై మున్సిపల్ ఉద్యోగి సంతకం ఉండటం ఆ వ్యాన్ విహార యాత్రకు పోవడం ఇప్పుడు రచ్చగా మారింది..

**చిందులు వేస్తూ డాన్సులు వేస్తూ హల్చల్**

ఈ ఆసక్తికర అంశం లో భూపాలపల్లి మున్సిపల్ కు చెందిన ప్రధాన నాయకుడి పై అందరూ ఫోకస్ పెట్టారు..అసలు ఆ నేత ఎందుకు సడన్ గా ఆ టూర్ లో ప్రత్యక్ష మయ్యాడు అనే దాని పై ఇప్పుడు చర్చ నడుస్తోంది..అసలు సంబంధం లేని వ్యక్తుల టూర్ లో అతను ఎందుకు కనిపించాడంటూ గుసగుసలు పెట్టుకుంటున్నారు..ఏకంగా బాహుబలి సినిమాలోని పాటకు డ్యాన్స్ చేస్తూ సదరు నేత బోటు లో ఎంజాయ్ చేస్తున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియా లో చక్కర్లు కొడుతుంది..

ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం..ఆ నేత తీరు పై ఇప్పటికే అధికార పార్టీ నాయకుల్లో అసంతృప్తి కూడా ఉండటంతో ఏం చేయాలో తోచక నాయకులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం..ఈ మొత్తం ఎపిసోడ్ లో సదరు నేతే కట్టప్ప లా మారి మున్సిపల్ అధికారులకు వెన్నుపోటు పొడిచినట్లు వార్తలు వినిపిస్తున్నాయి..డీజిల్ వ్యవహారం అంత సదరు నేత కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..మొత్తానికి బాహుబలి ఎపిసోడ్ ఏ క్లైమాక్స్ వైపు వెళ్తుందో వేచిచూడాలి..

**ఘనంగా ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి**

# జన్మదిన వేడుకలు

**మహిళా నాయకత్వానికి ఆమె నిలువెత్తు నిదర్శనం**

**ముదిరాజు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాష బోయిన భాస్కరరావు**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ నియోజకవర్గం శాసన సభ్యురాలు శ్రీమతి నలమాద ఉత్తం పద్మావతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈరోజు స్థానిక బస్టాండ్ సమీపంలో ముదిరాజు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , శ్రీ బాల ఉగ్ర నరసింహ స్వామి ఆలయ గౌరవ అధ్యక్షులు భాష బోయిన భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి కోదాడ హుజూర్నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి కి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మరెన్నో ఉన్నత పదవులు చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారుడు రాయపూడి వెంకటనారాయణ , పంది తిరపయ్య మాట్లాడుతూ కోదాడ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ వేలకోట్ల రూపాయలతో కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఉత్తం పద్మావతి రెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎం ఏ జబ్బర్ బాయ్ ,పంది తిరపయ్య, కంభంపాటి శ్రీనివాస్, చీదెళ్ళ హనుమంతరావు ,తాటికొండ నాగిరెడ్డి , ఎండి మౌలానా, తదితరులు పాల్గొన్నారు

# శ్రీరామ నామస్మరణలతో మార్మోగిన భద్రాద్రి





**భద్రాచలం అక్షిత న్యూస్:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయం లో బుధవారం శ్రీరాముని జన్మనక్షత్రం (పునర్వసు)ని పురస్కరించుకొని భద్రాచలం నిర్వహించే భద్రగిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా భక్తుల శ్రీరామ నామస్మరణలతో పురవీధులలో కాలినడకన పాదయాత్రతో భక్తి పారవశ్యశీతో భద్రగిరి ప్రదక్షిణ కన్నుల పండుగగా జరిగింది.

భక్త రామదాసు ట్రస్ట్ కొత్తగూడెం నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం సహకారంతో భద్రగిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా శ్రీరామ నామ జయజయ ధ్వానాలతో సాగింది.

భద్రగిరి తపస్సు ఫలితంగా వైకుంఠం నుండి శ్రీమన్నారాయణుడే స్వయంగా శ్రీ భద్ర మహర్షి పై కాలిడిన పుణ్య ప్రదేశం భద్రాచలంలో ప్రతి పునర్వసుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం భక్త రామదాసు పదవతరం వారసులైన కంచర్ల శ్రీనివాసరావు దంపతులు, దేవస్థానం ఈవో దామోదర్ రావు,ఆలయ అధికారులు,భద్రాద్రి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం.. ట్రాక్టర్ సీజ్

### రూ.5 వేల జరిమానా విధింపు

### అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్ శశిభూషణ్



**నిర్మల్ అక్షిత బ్యూరో, జూన్ 17:** భైంసా మండలంలోని వానాల్పాడు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. తహసీల్దార్ శశిభూషణ్ ఆదేశాల మేరకు గిర్దావర్ దత్తాత్రేయ తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత వాహనంపై రూ.5,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. విధించిన జరిమానా మొత్తాన్ని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శశిభూషణ్ హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని, ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

# నడిగూడెంలో ఘనంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు



**నడిగూడెం, అక్షిత న్యూస్:** కోదాడ శాసన సభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను నడిగూడెం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు,సర్పంచ్ ల ఫోరం మండల కన్వీనర్ బూత్కూరి వెంకటరెడ్డి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులతో కలిసి కేక్ కట్ చేసారు. అనంతరం మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు దున్నా శ్రీనివాస్, గోసుల రాజేష్, దాట్ల నాగేశ్వరరావు,వేల్పుల సోమయ్య, అట్టూరి పుష్పవతి నాగేందర్ రెడ్డి, పాటిబండ్ల రుక్మిణి వెంకటేశ్వరరావు,విమలపంగు సరోజినీ రంగయ్య కేశ గాని సరిత లక్ష్మణ్, సిర్రా రమ్య నాగేందర్,కంభంపాటి సరిత చైతన్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ముదిరెడ్డి నలిని వెంకటరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి వెంకటరెడ్డి,మొక్క బిక్షపతి,పగడాల ప్రభాకర్ రెడ్డి,శెట్టి సతీష్, పాతకోట్ల నాగేశ్వరరావు,ఎలుగూరి నాగరాజు,నలమాద వీరబాబు,కటికల పుల్లయ్య,గుండు విజయరామారావు,కత్తి విజయ్,నాగవరపు రాము, కాసాని గోపీనాథ్,షేక్ రియాజ్,కుక్కడప్పు భార్గవ్, షేక్ మౌలానా, పాతకోట్ల రాము,బాణాల సతీష్ కుమార్, దున్న రాజు,శ్రీరాముల శ్రీనివాస్ లంజపల్లి వీరబాబు,రేపాకుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల నాగరాజు సాయిబాబా ఆలయంలో ఆలయ పూజారి రాజశేఖర్ శర్మతో ప్రత్యేక పూజలు చేయించారు.

# పాత లింగాల చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

### 2.16 కోట్ల రూపాయలతో శాశ్వత మరమ్మతులకు అధికారులకు ఆదేశం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాత లింగాల చెరువు కట్ట గత సంవత్సరపు తుఫాన్ ప్రభావం వలన చెరువు కట్టకు గండ్లు పడి తెగిపోవడం వలన గత సంవత్సరం దానికి తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేపట్టడం జరిగింది. ఈ దశలో రాబోయే వానాకాలం సీజన్లో మళ్లీ చెరువు కట్ట తెగకుండా పూర్తిస్థాయిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇరిగేషన్ శాఖ మాత్యులుఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో 2.16 కోట్లతో శాశ్వత మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇరిగేషన్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్ రామ్ డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్ టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ తోటకూరి శివయ్య లతో చెరువు కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతాంగాన్ని వ్యవసాయాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలతో పాటు సాగునీటి సౌకర్యం కల్పించాలని అనేక అభివృద్ధి పథకాలను ప్రోత్సహిస్తున్నారని దానిలో భాగంగా పాత లింగాల చెరువు కట్ట శాశ్వత పరిష్కారం కొరకు 8 మీటర్లు వెడల్పు 15 మీటర్లు లోతుతో పూర్తి కాంక్రీట్ నిర్మాణంతో మరమ్మతులు చేపట్టడం జరగనున్నదని నాలుగైదు రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ జరుగుతుందని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. పాత లింగాల చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపడుతున్నందుకు రైతులు హర్షం ప్రకటించి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ డిఈ భానుమూర్తి, ఏఈ శ్యాం కుమార్ సర్పంచ్ ఇట్ట శ్రీను కిన్నెర సుజాత యడ్లపల్లి బాబు పండగ కోటి బుచ్చయ్య జూపూడి గోపాలరావు బైరెడ్డి యుగంధర్ రెడ్డి లక్ష్మయ్య రమేష్ శ్రీను రాయల లక్ష్మయ్య రాయల పెద్ద వెంకన్న గింజల నర్సిరెడ్డి జగన్నాథ రెడ్డి భావ్ సింగ్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సూర్యాపేటలో ఏపీ డిసిఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

### పెద్ద ఎత్తున స్వాగతం పలికిన అభిమానులు



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సూర్యాపేటలో జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.బుధవారం మంగళగిరికి వెళ్తున్న సందర్భంగా ఆయన సూర్యాపేట మీదుగా ప్రయాణించగా ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ సతీష్ రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఏవి రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున గుమికూడారు. అనంతరం వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు అభిమానులు,కార్యకర్తలంటే ఎంతో అభిమానం ఉందని, అభిమానుల్లో ఎవరికైనా ఇబ్బంది కలిగితే పవన్ తట్టుకోలేరని,అందుకే ఆయనకు బాదితుల పక్షాన వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన గుర్తింపు ఉందన్నారు.ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ అభిమానుల కోసం ఇంత సమయం కేటాయించడం గొప్ప విషయం అన్నారు.ఇటీవల ఢిల్లీలో బిజీ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ, అభిమానుల కోరిక మేరకు బాధితుణ్ణి కలుసుకుని ధైర్యం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.అభిమానుల పట్ల ఆయనకు ఉన్న ఆప్యాయతకు ఇది నిదర్శనమని అన్నారు.తెలంగాణలో కూడా జనసేన పార్టీ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని,భవిష్యత్తులో ఎన్నికల్లో మరింత బలంగా పోటీ చేస్తామని మనోధైర్యం కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి ఒక్కరి హక్కని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యమని,ప్రజల పక్షాన పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనన్మియా,వెంకటేష్, అశోక్,రవి,ఒర్సు రవి,లింగరాజు, సైదులు,విక్రమ్,సైదులు నాయక్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్దే... దేశ అభివృద్ధికి ప్రతిబింబం

### వనపర్తి మండల పార్టీ అధ్యక్షులు నక్క రవి కిరణ్

### గ్రామ అభివృద్ధికి నిధుల కేటాయింపు..

### హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** గ్రామ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మండల పార్టీ అధ్యక్షులు నక్క రవి కిరణ్ తో పాటు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ.. నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమమైందని వారు పేర్కొన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి గ్రామాలలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేశారని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని మండల పార్టీ అధ్యక్షులు అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడద్దని నాలుగు గ్రామాలలో కోటి 20 లక్షలతో గోదాములను నిర్మించేందుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే మహిళా సమైక్య భవనాలను, అంగన్వాడి కేంద్రాల శాశ్వత భవనాలను, శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలను నిర్మించుకునేందుకు మండల పరిధిలో దాదాపుగా 3 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించడం కోసం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి, అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామ రూపురేఖలు మారడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సహదేవు, శివకుమార్,బుచ్చా నాయక్, అబ్దుల్లా, సురేష్ పలువురు పాల్గొన్నారు.